దోపిడీ కేసులో నలుగురు అరెస్టు

3.5 కేజీల బంగారు బిస్కెట్లు స్వాధీనం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: వి కోట మండలంలో చోటుచేసుకున్న దారి దోపిడీ కేసును ఛేదించి, నల్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 3.2 కోట్ల రూపాయలు విలువైన 3.5 కిలోల ఐదు బంగారు బిస్కెట్లను వి కోట పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 2వ తేదీ వికోట మండలంలో చోటు చేసుకున్న దోపిడీ కేసును రెండు రోజులో ఛేదించారు. ఈ కేసులో కీలకమైన నిందితులు డి జయపాల్, ఎం ముక్రామ్, కెఆర్ బాబు, షణు వీరంతా కర్నాటక కెజిఎఫ్ ఒకే ప్రాంతానికి చెందినవారు. ఈ కేసులో కీలక సుత్ర ధాడుడైన జయపాల్ కేజీఎఫ్ పట్టణం లోని 4వ వార్డు కి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈనెల రెండో తేది రాత్రి 8.45 గంటల సమయంలో బాధితుడు చేతన్ కుమార్ తన కారులో వి కోట నుండి పేర్నంబట్టుకు నాయకనేరి ఘాట్‌లో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు కార్లలో వచ్చి అతనిని బెదిరించి అతని వద్ద గల 3.5 కిలోల బంగారు బిస్కెట్లను దొంగలించుకొని పోయారు. దీనిపై ఫిర్యాదుదారుడు దీపక్ కుమార్ 3వ తేదిన వి కోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వి కోట ఎస్‌ఐ సోమశేఖర్ రెడ్డి కేసు నమోదు చేశారు. ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు (వి.కోట ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి బృందం, గంగవరం రూరల్ ఇన్‌స్పెక్టర్ మురళి మోహన్, బైరెడ్డి పల్లి ఎస్‌ఐ పరశ రాముడు బృందం, ఎస్.బి. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ బృందం, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర రావు బృందం,) ఏర్పాటు చేసి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలలో గాలింపు చర్యలను చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాంకేతికతను ఉపయోగించి రాబడిన కచ్చితమైన సమాచారం మేరకు ఈనెల 5న మధ్యాహ్న సమయంలో వి కోట మండలం రాఘవపల్లి గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట వి.కోట - పలమనేరు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్, వారి సిబ్బంది, ఇన్నోవా కారును ఆపి తనిఖీ చేయగా, ఆ కారులో ప్రయాణిస్తున్న కేజిఎఫ్ పట్టణానికి చెందిన జయపాల్, ముక్రమ్, బాబు, షణ్ముగం వద్ద నుండి సుమారు 3.5 కిలోల బరువున్న 5 బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకొని, నేరానికి ఉపయోగించిన ఇన్నోవా కారుతో పాటు నిందితులను అరెస్ట్ చేశారు. జయపాల్‌ను విచారించగా ఫిర్యాదు దారుడు దీపక్ కుమార్ ఒక నగల వ్యాపారి అని, చెన్నై నుండి కేజీఎఫ్ కు వెళుతుండగా, ఓ షేడ్ వద్ద బంగారు బిస్కెట్లు తీసుకొని వస్తున్న సమయంలో దోపిడీకి పాల్పడినట్లు వెల్లడించాడు. ఆ సేటు దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్న ముక్రమ్‌అనే వ్యక్తి ఈ సమాచారాన్ని జమిల్‌కు తెలిపాడు. జమిల్ కు జయపాల్ పరిచయం ఉండటంతో, ఇద్దరూ కలిసి జయపాల్‌ను కలిసి విషయం వివరించారు. దీంతో జయపాల్, తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్టు కు చెందిన మరో 12 మందితో కలిసి దీపక్ కుమార్ వెళుతున్న మార్గాన్ని గుర్తించి, ముందుగానే ప్లాన్ చేసుకుని దారి దోపిడీకి పాల్పడ్డామని నిందితుడు తన విచారణలో పేర్కొన్నాడు. ఈ ఘటనలో వారు బంగారు బిస్కెట్లను అపహరించినట్లు తెలిపాడు .కేసు విచారణలో భాగంగా నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు 3.5 కిలోల బంగారు బిస్కెట్లు దోపిడీకి ఉపయోగించిన ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

అదుపులోకి తీసుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు చూపుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

సమాజంలో మానవతా విలువలు పెంచాలి

సాహితీ పోషకులు, రచయిత కట్టమంచి బాలకృష్ణారెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సమాజంలో మానవతా విలువలు పెంచాలని సాహితీ పోషకులు, రచయిత కట్టమంచి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక దొరస్వామి అయ్యంగార్ రోడ్డు లోని రాజా మహల్ ఫంక్షన్ హాలులో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కార సభ నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కవులు ,రచయితలు వారి రచనలను ప్రోత్సహించే దిశగా నాలుగు ప్రక్రియలకు కథాసంపుటాలు, నవలలు, చందో బద్ధ కవిత్వం , రచన కవిత్వం పురస్కార పోటీకి ఆహ్వానించి ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజు పురస్కార సభ ఏర్పాటు చేసి పోటీకి పంపిన అందరి రచయితలను ఆహ్వానించి సన్మానిస్తామన్నారు. నాలుగు ప్రక్రియలలో ఫలితాలు ప్రకటించి ఒక్కొక్క ప్రక్రియలోఉత్తమ రచనగా ఎంపికైన వారిని పదివేల నగదు, జ్ఞాపికలు బహుమతులు అందించారు. వచన కవిత్వంలో 'ఎప్పుడొస్తుందో 'లక్ష్మీ శ్రీనివాస్ పలమనేరు, చందోబద్ధ కవిత్వంలో' జీవిత సత్యాలు' శ్యామలాదేవి గంగమ్మ గుడి, నవలలు 'నాడోడి బతుకులు' మూరిశెట్టి గోవింద్, తిరుపతికి అందించారు. ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు రోజా ప్రియ, నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కుప్పం రెడ్డెమ్మ సాహితీ ట్రస్టుల ద్వారా ఇటు సాహిత్యానికి, అటు తెలుగుభాషా సేవకు కషి చేస్తున్నామని యువ రచయితలను ప్రోత్సహిస్తున్నామని అందుకు సహకరిస్తున్న రచయితలకు కవులకు కృతజ్ఞతలు తెలిపారు.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కార సభలో మాట్లాడుతున్న డాక్టర్ రామలక్ష్మి

ఎట్టకేలకు పట్టుబడ్డ చిరుత

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతి వేదిక్ వర్సిటీ పరిధిలో గత మూడు నెలలుగా చిరుత సంచారంతో అక్కడి విద్యార్థులు, అధ్యాపకులు బెంబేలెత్తిపోయారు. రాత్రిపూట విద్యార్థులు తమ హాస్టళ్ల నుండి బయట తిరగవద్దని, చిరుత సంచారం నేపథ్యంలో అటవీశాఖ అధికారులు పలు ఆంక్షలను విధించారు. హాస్టళ్ల వద్ద వ్యర్థాలు వేయడంతో వాటిని తినడానికి వచ్చిన కుక్కలను తన ఆహారంగా గుర్తించిన చిరుత ఆ ప్రదేశాన్ని విడవకుండా ప్రతిరోజూ వచ్చి కుక్కలను ఎత్తుకెళ్లేది. దీంతోపాటు అడవి నుండి ఆహారం కోసం వచ్చే వన్యప్రాణులను ఆహారంగా చేసుకునేది చిరుత. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన అటవీ శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అయినా పులిజాడ కనిపెట్టలేకపోయారు. ఇక బోన్లు ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించుకుని రెండు చోట్ల చిరుత పులిని బంధించడానికి బోనులను ఏర్పాటు చేశారు. అయితే బోన్లు ఏర్పాటు చేసి 60 రోజులకుపైగా గడిచినా చిరుత బోనుకు చిక్కకుండా చాకచక్యంగా తన ఆహారం కోసం వచ్చి వెళ్ళేది. ఈ నేపథ్యంలో రాత్రిపూట గస్తీ తిరిగే పోలీసులకు చిరుత కనపడ్డ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. శనివారం ఎట్టకేలకు చిరుత అటవీశాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కుకుంది. పులి బోనులో చిక్కుకుంది అన్న వార్త ఆదివారం తెల్లవారేసరికి వర్సిటీ మొత్తం పాకింది. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. బోనులో ఉన్న చిరుతను వెటర్నరీ డాక్టర్ అర్జున్ సహాయంతో అటవీ అధికారులు చాకచక్యంగా బంధించి చిత్వేలు మండలం బాలయపల్లి దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అయితే వర్సిటీ పరిధిలో రెండు చిరుతపులులు సంచరిస్తున్నాయని అటవీ శాఖ అధికారులు అనుమానించారు. శనివారం ఒకటి పట్టుబడిందని, మరొకటి కూడా ఉండి ఉంటుందా? అన్న అనుమానం విద్యార్థుల్లో ఉంది.

నేడు కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) ను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉదయం 9 గంటలకు జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజక వర్గ, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

నవమి వేడుకల్లో కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలోని టాప్ లైన్, పిజిఆర్ పోలీసు క్వార్టర్‌లలో శ్రీ సీతారామ దేవాలయాలలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని చిత్తూరు ఏఆర్ పోలీసులు ఆదివారం శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి విఎన్ మణికంఠ చందోలు కుటుంబ సమేతంగా సీతారాములు వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అడిషనల్ ఎస్‌పి ఏఆర్ శివానంద కిషోర్ దంపతులు స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అర్చకులు వేద మంత్రాలతో విశేష పూజలు నిర్వహించి వారిని ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్, ఎస్‌పి, అడిషనల్ ఎస్‌పిల చేతుల మీదుగా సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.



గో సంరక్షణకు విరాళంగా చెక్కును అందిస్తున్న దాతలు

'గో సంరక్షణ'కు విరాళం

ప్రజాశక్తి - చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ సన్నిధిలో గో సంరక్షణ పథకానికి దాత 80 వేల రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరానికి చెక్కును తిరుపతికి చెందిన దాతలు బాలాజీ దంపతులు అందించారు. వారికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

పలమనేరులో సందడి చేస్తున్న వృషభ సినిమా టీం సభ్యులు

'వృషభ' సినిమా టీం సభ్యుల సందడి

ప్రజాశక్తి- పలమనేరు: వృషభ సినిమా టీం సభ్యులు పలమనేరులో ఆదివారం సదడి చేశారు. పలమనేరు నియోజకవర్గం పలమనేరు రూరల్ మండలం నక్కపల్లి గ్రామానికి చెందిన నిర్మాత ఉమా శంకర్ రెడ్డి, పకీరుపల్లికి చెందిన డైరెక్టర్ కామరాజు బృందం నిర్మించిన వృషభ సినిమా ఈ నెల నాలుగవ తేదీ విడుదలై విజయం సాధిస్తున్న శుభ సందర్భంలో ఆదివారం ఉదయం సినిమా టీం సభ్యులు జబర్దస్త్ టీం లోని సభ్యులు అందరూ కలిసి పలమనేరులో తమ ఆనందాన్ని ప్రేక్షకులతో కలసి పంచుకొని సందడి చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు వృషభ సినిమా టీం సభ్యులను ఘనంగా సన్మానించారు.

హోం మంత్రిని కలిసిన జీవన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆదివారం వేలూరు వద్దనున్న శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్ విచ్చేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితను మర్యాదపూర్వకంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సోదరుడు గురజాల జీవన్ కలసి స్వాగతం పలికారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎస్‌పి సతీమణి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఏఆర్ పోలీసు విభాగం వారు సాయుధ దళం కార్యాలయం వెలుపల ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌పి మణికంఠ చందోలు సమక్షంలో ఎస్‌పి సతీమణి హర్షిత ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజలకు చల్లని నీటిని అందించాలనే ఉత్తమ లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల, పిల్లల రక్షణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఇరువైపులా ప్రత్యేక బ్యానర్లు ఏర్పాటు చేశారు. మహిళలు ఏదైనా సమస్యలను ఎదుర్కొనే సమయంలో ఎవరిని సంప్రదించాలో క్లుప్తంగా వివరిస్తూ ఏర్పాటు చేశామన్నారు. ఇంటి భద్రత కోసం చిత్తూరు జిల్లా పోలీసులు ప్రవేశపెట్టిన స్మార్ట్ అలారమ్ లాక్స్, ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలపై అవగాహన కలిగించే బోర్డులు స్థాపించారన్నారు. ఇంటి భద్రతకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ప్రజలు పోలీసుల సహకారంతో తమ ఆస్తులను, కుటుంబాలను కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ రాజశేఖర్ రాజు, అడిషనల్ ఎస్పీ ఏఆర్ శివానంద కిషోర్, ఏఆర్ డిఎస్పీలు మహబూబ్ బాష, చిన్ని కష్ణ, ఆర్‌ఐలు భాస్కర్, ఆర్ఎస్‌ఐ లు, పోలీస్ అసోసియేషన్ ప్రసిడెంట్ ఉదయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని అందిస్తున్న ఎస్‌పి మణికంఠ చందోలు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్:

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన సదుం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఊటు పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఊటుపల్లిలో కాపురం వుండు కంబెల్ల మదన మోహన్ (54) ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పాల మంద గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దూరు మార్గంలో కింద పడి ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ తీగల మరమ్మతు పనిలో నిమగ్నమయ్యాడు. ప్రమాద వశాత్తు విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. సదుం ఎస్ ఐ షేక్ షా వలి కథనం మేరకు.. ఆదివారం ఉదయం సుమారు 7.30 గంటల ప్రాంతంలో సదుం వయా పాలమంద కలికిరి రోడ్డు మార్గంలో టమోటా పంటలకు నాటుకునే కట్టెల లోడుతో కలికిరి వైపు వెళుతున్న లారీ పెద్దూరు గ్రామ సమీపంలో ఒక మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం కింద పోవడంతో ఊటుపల్లి కి చెందిన మదన్ మోహన్ మరమ్మతులు చేయడానికి వెళ్లి విద్యుత్తు తీగను కట్ చేస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మదన్‌మోహన్ కుమారుడు రవి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సదుం ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. బతుకు తెరువు కోసం ఎలక్ట్రిక్ పనులు కోసం వెళ్లి, విద్యుత్ షాక్‌తో కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతుడు మదన్మోహన్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు, భార్య ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మదన్‌మోహన్

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో పిఈఎస్ కుప్పం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 68 మంది హాజరు కాగా వారిని డాక్టర్ వాసు, డాక్టర్ రూప పరిశీలించి వివిధ చికిత్సలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ ఎనిమిది మందిని గుర్తించారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు మధ్యాహ్న భోజనం అందించారు. కంటి చికిత్సకు ఎంపికైన వారికి కుప్పం పిఎస్ హాస్పిటల్ ఉచిత బస్ సౌకర్యం కల్పించి కంటి ఆపరేషన్ అయిన తర్వాత ఇంటికి చేర్చే వరకు ప్రతి ఖర్చు మారుతి ఫౌండేషన్ ఉచితంగా భరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసు, రూప, మారుతి, ఫౌండేషన్ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

శోకసంద్రంలో గంగినాయన పల్లి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: నాలుగేళ్ల చిన్నారి ఇంటి వద్ద వున్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిన సంఘటన బైరిపల్లిలో చోటు చేసుకుంది. గంగి నాయనిపల్లి లోని గాయత్రి శివ దంపతులు మూడో కాన్పు కోసం అత్త మామ వాళ్ల ఇంటికి వెళ్లారు. ఈ తరుణంలో పిల్లలు లేకుండా ఆపరేషన్ చేయించుకునేందుకు గాయత్రి వీకోట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. రెండో సంతానం జాను (4)ను శనివారం అవ్వ వద్ద వదిలి వెళ్లారు. అదే రోజు రాత్రి నీటి సంపులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. స్థానికులు తల్లిదండ్రులకు తెలపడంతో ఆస్పత్రి నుండి బైరపల్లికి చేరుకొని తమ బిడ్డను స్వగ్రామమైన గంగినాయనిపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

నీటి సంపులో పడి మృతి చెందిన చిన్నారి జాను

చిన్నారి మృతి తో ఆ గ్రామం శోకసంద్రంగా మారింది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ పి నరసింహప్రసాద్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్స్‌లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ ఆమోదంతో 2025-26 వార్షిక బడ్జెట్ 2 77 కోట్లు రూపాయలతో ఆమోదించారు. రానున్న రోజుల్లో కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పన్నుల చెల్లింపుల్లో నగరంలోని అస్తిపన్ను, నీటి కనెక్షన్ పన్నులు సకాలంలో చెల్లించి నగర పాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో కమిషనర్ మాట్లాడారు..

ప్రజాశక్తి: వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాము.. ఎక్కడ నీటి సమస్య ఉన్నట్లు తెలిసినా వెంటనే ట్రాన్స్‌పోర్టు ద్వారా వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. మరమ్మతుకు గురైన నీటి సరఫరా బోర్లును వెంటనే మరమ్మతులు చేస్తున్నాం. మోటర్లు పాడైపోతే కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం. ఎన్‌టిఆర్ జలాశయంలో జనవరి మాసంలో కురిసిన వర్షాలకు వర్షపునీటితో నిండుగా వుంది. నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

ప్రజాశక్తి: పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: ఇంటింటా చెత్తసేకరణ చేపడుతున్నాం. రెండు రోజులకో మారు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.. పారిశుధ్య కార్మికుల సంఖ్య కార్పొరేషన్ విస్తీర్ణానికి తగ్గటుగా లేదు. మరో రెండు వందల మంది పారిశుధ్య కార్మికుల నియామకం చేసుకోవాల్సి ఉంది. మున్సిపల్ రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం.. త్వరలో కొత్త కార్మికుల నియామకం చేపడుతున్నాం.

ప్రజాశక్తి: పార్కుల అభివృద్ధి ఎప్పటిలోగా చేస్తారు?

కమిషనర్: నగరంలో ప్రధానంగా గంగినేని చెరువు, కట్టమంచి చెరువుతో పాటు ఇటీవల మునస్వామి నాయుడు పార్కును అభివృద్ధి చేశాం.. కట్టమంచి చెరువులో వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేశాం..గంగినేని చెరువు ఆదునీకరణతో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి: మురికివాడల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కమిషనర్: మురికివాడ అభివృద్ధి కోసం కేటాయించే నిధులతో మౌళిక వసతులు కల్పిస్తున్నాం.. నగరంలోని అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణం జరుగుతోంది. అలాగే కౌన్సిల్ ఆమోదం మేరకు మురికివాడల్లో సీసి రోడ్లు, డ్రైనేజి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం..

ప్రజాశక్తి: మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ, పన్నుల చెల్లింపు ఎలా వుంది....?

కమిషనర్: మున్సిపల్ ఆస్తుల పరిరక్షణ విషయంలో కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ ఆస్తుల గురించి చర్చిస్తున్నాం.. ఈ ప్రాంతాలను అభివద్ధి చేయడంతో పాటు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ప్రహరీ గోడలను నిర్మిస్తున్నాం. పన్నుల చెల్లింపు విషయంలో గతేడాది కంటే ఈ ఏడాది పన్నుల వసూలు ఆశాజనకంగా వుంది. ప్రభుత్వం పన్ను రాయితీ అందించడంతో పన్ను చెల్లింపుదారులు పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.

ప్రజాశక్తి: నీవానది వరద ముంపునకు గురి కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: ఎంఎల్‌ఏ సహకారంతో నీవానదికి ఇరువైపులా కాంక్రీట్ గోడ నిర్మాణం కోసం నిధులు మంజురు కావాల్సి ఉంది. నిధులు మంజురైన వెంటనే టెండర్లు ఆహ్వానించడం జరుగుతుంది. నీవానదిలోని పిచ్చి మొక్కలు తొలగించి వర్షం వస్తే నీరుపారేలా జేసీబితో శుభ్రం చేశాం.. నీవానది పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను సర్వే చేయాల్సి ఉంది. వీధి దీపాల విషయానికి వస్తే నగరంలో పూర్తిగా ఎల్ఈడి లైట్లు ఏర్పాటు చేశాం. అవసరమైన చోట్లు వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన వీధి దీపాలు అందుబాటులో ఉన్నాయి.

అంతరిస్తున్న తాటిచెట్లు

- రహదారుల్లో నీడ కనుమరుగు
- చెట్ల వల్ల బహుళ ప్రయోజనాలు
- తాటి చెట్ల సంరక్షణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని వినతి

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం : పేదవానికి తల దాచుకోవడానికి గూడు ఏర్పాట్లలో దూలాలు, మట్టలు రూపంలో ముఖ్యపాత్ర పోషించిన తాటి చెట్లు ఎస్ఆర్‌పురం మండలంలో పూర్తిగా అంతరించి పోతున్నాయి. గతంలో రోడ్డుకు ఇరు వైపులా తాటి చెట్లు పాదచారులకు, వాహన చోదకులకు చక్కని నీడని ఇచ్చేవి. అవి నేటి ఆధునిక యుగంలో రోడ్డు విస్తరణ సందర్భంగా తాటి చెట్టు కూలిపోతూ అంతరిస్తున్నాయి. ఇటు సిమెంటు రేకులు, కాంక్రీట్ ఇళ్ల నిర్మాణంగా కారణంగా తాటి మట్టల ఇళ్లు కనుమరు గయ్యాయి. దీంతో ఈ తాటి చెట్లు పూర్తిగా నిరాదరణకు గురవుతున్నాయి. ఔషధాలలోనూ వీటిని ఉపయోగం వుందని, పొలాలకు సహజ ఎరువుగానూ ఉపయోగపడుతుందని పలువురు పేర్కొంటున్నారు. వీటి నుండి వచ్చే తాటి ముంజలు కరువై కూలీలు ఉపాధి కోల్పోతున్నారు. బహుళ ప్రయోజనాలు వున్న తాటి చెట్ల సంరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

అంతరిస్తున్న తాటిచెట్లు

గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్‌పురం మండలంలో తాటి చెట్లు జాడ క్రమంగా తగ్గిపోతున్నాయి.

మానవ జీవనంలో భాగమై, ప్రతి అవసరానికి పనికొచ్చిన తాటి చెట్లు నేడు నిరాదరణకు గురవుతున్నాయి. ఆధునిక జనారణ్యంలో వాటి జాడ కనుమరుగవుతోంది. భవిష్యత్తులో పిల్లలకు తాటి చెట్లను బొమ్మల ద్వారా చూపించాల్సి వస్తుందేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోనే తాటి చెట్ల పెంపకం ఎక్కువగా వుంది. మరో రెండు మూడు రాష్ట్రాలలో అవి ఉన్నా భారీగా కనిపించవు. సముద్ర తీర ప్రాంతాలు, ఇసుక భూములు తాటి చెట్లు పెరగడానికి అనుకూలంగా వుంటాయి. ఆక్వా రంగ అభివృద్ధి, బీడు భూములు ఇతరత్రా అవసరాలకు మళ్లడం, ఇళ్ల స్థలాలకు భూముల వినియోగం పెరగడం, రోడ్లు, గ్రామాల విస్తీర్ణ అవసరం తగ్గి ప్రజలు చిన్నచూపు చూడడం తదితరాల వల్ల నేడు తాటి చెట్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. వందల సంవత్సరాలు ప్రజల అవసరాలకు ఉపయోగపడ్డ తాటి చెట్లు సంపద మనుగడ ప్రమాదంలో పడింది.

బహుళ ప్రయోజనాలు..

గతంలో పూరిల్లు నిర్మించేటప్పుడు మొదట తాటాకులు కప్పి దానిమీద వరిగడ్డి వేసేవారు. ఇంటిపై కప్పున తాటాకులు చాలా ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేది. వేసవిలో వచ్చే తాటి ముంజులు శరీరానికి చలవ చేస్తాయనే నమ్మకం వుంది. తాటిపండ్ల నుంచి గుజ్జును తీసి తాంధ్ర రూపంలో విక్రయించే చిన్న పరిశ్రమలు గతంలో చాలా చోట్ల ఉండేవి. ఇక పండుగ , శుభ కార్యాలు వంటి వేడుకల సమయంలో ఊళ్లల్లో తాటాకులతో చలువ పందిళ్లు వేసేవారు. తాటి మట్టలు పొలాలకు సహజ ఎరువుగా ఉపయోగపడేవి. పొలాలలో గుంతలు తీసి వాటిలో మట్టలు వేసి మట్టి కప్పేవారు. అవి కుళ్లిన తర్వాత బయటికి తీసి పొలాలకు వేసేవారు. నేలలకు ఇది మంచి సత్తువనిస్తుందని రైతుల నమ్మకం. ఇలా రకరకాలుగా ప్రజలకు అవసరం ఉండటం వల్ల గతంలో బీడు భూములన్నింటిలో తాటి చెట్లు పెంపకం సాగించేవారు. అయితే నేడు గ్రామాలలో పూరిళ్ల స్థానంలో సిమెంటు ఇటుకలతో పక్కా ఇల్లు ఏర్పాట వుతున్నాయి. చలవ పందిళ్ల స్థానాన్ని షామియానాలు ఆక్రమించాయి.. దీంతో తాటిచెట్ల అవసరం తగ్గింది. దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో నేడే తాటి చెట్లు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వాలు ఈ చెట్లపై దృష్టి సారించి వీటి రక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

తాటి చెట్లు కనుమరుగు బాధాకరం

నా వయస్సు 91 సంవత్సరాలు..మా కాలంలో పొలాల గట్లపై.. చెరువు కట్టపై.. వంకల్లో తాటిచెట్లు విరివిగా ఉండేవి. వేసవి కాలంలో తాటి ముంజలు తినేవాళ్లం. తాటి మట్టలతో గూడ తయారుచేసి వర్షానికి గొడుగుకు బదులు అడ్డంగా తలపై వేసుకునే వాళ్లం..తాటి మట్టలను పూరిపాకలకు కప్పుకునేవాళ్లం.. తాటి చెట్లు కొట్టి దూలాలుగా వాడుకునేవారు.. అలాంటి తాటి కనుమరుగై పోవడం బాధాకరం..

- కుంకు దొరస్వామి నాయుడు, అంకనపల్లె , వివిపురం పంచాయతీ, ఎస్ఆర్ పురం.

తాటి మానును నీళ్ల పైపులా వాడేవాళ్లం..

నా వయసు 89 సంవత్సరాలు.. మా తాతలు ఆ కాలంలో వ్యవసాయంలో పంటల సాగు కోసం తాటి చెట్ల మధ్య భాగంలో ఉన్న గుజ్జును తీసి తాటి చెట్లను పైపులా నీళ్ల పారేందుకు వాడేవారు. తాటిచెట్టు కలప గట్టిగా ఉండి ఇల్లు కట్టుకోవడంలో, పాడి రైతులు పాడి ఆవులకు మేతను భద్రపరిచేటందుకు, పాడి ఆవుల పాకలు వేసేందుకు , దూలాలుగా స్తంభాలుగా ఉపయోగించేవారు.

-అపోజి , ఒడ్డుపల్లి, కటిక పల్లి గ్రామపంచాయతీ , ఎస్ఆర్ పురం.

తాటి ఆకు విసనకర్రలు వాడే వాళ్లం..

నా వయస్సు 70 సంవత్సరాలు.. మేము చిన్నప్పుడు కరెంటు, ఫ్యాన్లు , ఏసీలు లేవు.. తాటాకుల విసనకర్రలతోనే వేసవి కాలాన్ని గడిపే వాళ్లం. ఓ ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి విసనకర్రలు ఉండేవి. తాటి ముంజలు డబ్బులు కొనే పరిస్థితి ప్రస్తుతం..గతంలో వంకల్లో, వాగుల్లో గట్లపైన తాటి చెట్లు ఉండేవి. తాటి ముంజలు తినే వాళ్లం.. ఇప్పుడు ఓ డజను తాటి ముంజలు 50 నుంచి 70 రూపాయల వరకు ధర పలుకుతోంది.. తాటి చెట్లు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి..

- కె. గోవిందమ్మ , 49 కొత్తపల్లి మిట్ట, ఎస్ఆర్ పురం.

క్రైం న్యూస్

గాయపడ్డ వారి నుండి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కుటుంబ సభ్యుల ఘర్షణ
ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కుటుంబ సభ్యుల ఘర్షణలో ఇద్దరికి గాయాలు అయ్యాయని సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు..ఆదివారం మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన బొజ్జయ్య కుమారుడు బాబు అతడి భార్య ఇద్దరికీ మనస్పర్ధలు రావడంపై సమీప బంధువులు ఎర్రాండ్లపల్లికి చెందిన శేఖర్, కవిత, యశ్వంత్ ఆనందమ్మ, దేవిక, భాగ్యమ్మ సమస్య గురించి చర్చించేందుకు వచ్చారు. మాటల సందర్భంగా సభ్యుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో బాబుకు, యశ్వంత్‌ల తలకు గాయాలు కాగా బాబు ఫిర్యాదు మేరకు శేఖర్, కవిత, ఆనందమ్మ, దేవిక, భాగ్యమ్మపై కేసు నమోదు చేశారు. యశ్వంత్ ఫిర్యాదు మేరకు బాబు, దుర్గాప్రసాద్ పై కేసు నమోదు చేశామని, రెండు కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బహుమతులు అందిస్తున్న టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం

యువత క్రీడల్లో రాణిస్తేనే ఉద్యోగాల్లో ప్రాధాన్యత
పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: యువకులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత లభిస్తుందని పార్లమెంట్ టిడిపి టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని తూగుండ్రం హైస్కూల్లో తూగుండ్రం క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులు పాటు 23 జట్లు పోటీపడ్డాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొదటి బహుమతి ఆవలకొండకు క్రికెట్ జట్టుకు రూ.15వేలును, రెండో బహుమతి తూగుండ్రం దళిత వాడకు చెందిన క్రికెట్ జట్టుకు రూ.8వేలు , మూడవ బహుమతి ఆంబోదరపల్లి దళిత వాడకు చెందిన క్రికెట్ జట్టుకు రూ.4వేలును అందించారు. నిర్వాహకులు మొదటి బహుమతి 20 వేల రూపాయల దాత శివనాయుడు, ద్వితీయ బహుమతి పదివేల రూపాయల దాత తిరుమల నాయుడు లతో కలిసి టిడిపి నేత జీవరత్నం నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ మేనేజర్లు వేలాయుధం, జ్యోతి రాజ్, బాబు, క్రికెట్ లీగ్ నిర్వాహకులు శరత్ కుమార్, శాంత కుమార్ , సంజయ్ కుమార్, విన్సెంట్, జోషేంద్రబాబు, నియోజకవర్గ టిడిపి ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి అరుల్ నాధన్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మణిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : అనారోగ్యంతో ఇబ్బం ది పడుతున్న మాజీ సర్పంచ్‌ను మాజీ డిప్యూటీ సిఎం నారాయ ణ స్వామి ఆదివారం పరామర్శించి తాను అండగా వుంటానని భరోసా కల్పించారు. ఎస్ఆర్ పురం మండలంలోని కటిక పల్లి గ్రామ పంచాయతీ కటికపల్లి స్థానిక మాజీ సర్పంచ్ మణి గత కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న నారాయణస్వామి మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రతి వైసిపి కార్యకర్తకు, నాయకులకు తాను అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దని నారాయణస్వామి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మెరుగైన వైద్యం అందించడానికి వైసిపి కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వైసిపి కార్యకర్తకు , నాయకులకు అన్నివేళలా పార్టీ అండగా ఉంటుందని ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు గురువారెడ్డి, జనార్ధన్, రాజశేఖర్ రెడ్డి, యువ నాయకుడు శ్యామ్, రాష్ట్ర నాయకులు కలప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపల్లి గంగమాంబ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణం కొత్తపేటలో వెలిసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ జాతరను ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి, ఆలయ నిర్వాహకులు, పూజారులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజారుల బృందం ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి బి.వి వెంకటేశులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, వివిధ పుష్పాలతో, పట్టు వస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి పతాక ఆవిష్కరణ చేసి జాతరను ప్రారంభించారు. నేటి నుండి 15 రోజులపాటు జాతర జరుగుతుందని, నేటికీ 14వ రోజు అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 15వ రోజు అమ్మవారికి పొంగళ్ల సమర్పణ తో జాతర ముగుస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడు రాష్ట్రాల కూడలిలో వెలిసిన అమ్మవారిని దర్శించుకోవడానికి ఆంధ్ర తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తాదులు పెద్ద సంఖ్యలో విచ్చేయడం ప్రతి సంవత్సరం చూస్తూనే ఉన్నామని, జాతర సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భక్తులు సైతం ఆలయ నిర్వాహకులకు సహకరించాలని బాలయ్య కమిటీ సభ్యులు, పూజారులు కోరారు.

అవార్డు అందుకున్న ప్రముఖ రచయిత మూరిశెట్టి గోవింద్

గోవింద్‌కు సాహితీ అవార్డు
పలువురి అభినందనలు

ప్రజాశక్తి - కార్వేటినగరం: ప్రతి సంవత్సరం శ్రీరామనవమి నాడు చిత్తూరులో డాక్టర్ రామలక్ష్మమ్మ తన తల్లి పేరుతో ప్రతిష్టాత్మకంగా ఇచ్చే కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు కార్వేటినగరం మండలం సిడి కండ్రిగ గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత మూరిశెట్టి గోవిందుకు ఈ ఏడాది లభించింది. ఆయన రాసిన 'నాడోడి బతుకులు'కు ఈ అవార్డు అందించారు. ఈ అవార్డు రావడంతో సీడీకండ్రిగ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు లక్ష్మీపతి రెడ్డి, వీరాస్వామి మందడి, ఆకుల గోపి, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన కార్వేటినగరం ధర్మరాజుల స్వామి ఆలయ కమిటీ

రవి యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం ద్రౌపది ధర్మరాజుల స్వామి ఆలయ నూతన అధ్యక్షులుగా మేళం రవి యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా భజన గౌతం వర్మ, ఉపాధ్యక్షులుగా కట్ల రవి రెడ్డి, అదనపు కార్యదర్శిగా రాయల చెరువు సాయి రాయల్, కోశాధికారిగా కనక రెడ్డి లక్ష్మీపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ద్రౌపది ధర్మరాజుల ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రవి యాదవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు, యువతకు ధన్యవాదాలు తెలిపారు. ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ అధ్యక్షులు ఆర్ బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, మాజీ అధ్యక్షులు సోము శేఖర్, హరి, బాబుమేస్త్రి, వాసుదేవరెడ్డి, రాజేంద్రరెడ్డి, గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

ఓబులేష్‌ను పరామర్శిస్తున్న టిడిపి నాయకుడు రమేష్‌రెడ్డి

ఓబులేష్‌కు అండ: టిడిపి

ప్రజాశక్తి -చౌడేపల్లి: వైసిపి దాడిలో గాయపడ్డ టిడిపి కార్యకర్త ఓబులేష్‌ను టిడిపి నాయకుడు గువ్వల రమేష్‌రెడ్డి (చిట్టి) ఆదివారం పరామర్శించారు. మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఓబులేష్ పై అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన వారు దౌర్జన్యానికి పాల్పడి ఓబులేసు పై కర్రలు, రాడ్లతో దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. గాయపడిన ఓబులేషును స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి (చిట్టి) హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధితుడు ఓబులేసును పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓబులేసును ధైర్యంగా ఉండాలని పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

పెత్తందారుల కుట్రతోనే విగ్రహం తొలగింపు

- సదుం పిఎస్, తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ హెచ్చరిక

ప్రజాశక్తి -పుంగనూరు: అగ్ర కులస్తుల (పెత్తందారుల) కుట్రలో భాగంగానే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని సదుం మండలం కలకడపల్లిలో తొలగించారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. పుంగనూరు మాల మహానాడు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం కలకడ వారి పల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారని చెప్పారు. కానీ ఆ గ్రామంలోని అగ్రకులస్తులు గుడికి అడ్డమనీ విగ్రహాన్ని తొలగించాలని తెలిసి మాల మహానాడు ఆధ్వర్యంలో సదుం పోలీస్ స్టేషన్, తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన, ధర్నా చేస్తే ఎస్ఐ విగ్రహానికి సెక్యూరిటీ కల్పిస్తామని విగ్రహాన్ని ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చారన్నారు. కానీ రెండు రోజుల క్రితం సదుం ఎస్ఐ, తహశీల్దారు ఆధ్వర్యంలో విగ్రహాన్ని తొలగించారన్నారు. ఇది చాలా దారుణమని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అగ్రకులాల ఆధిపత్యం చెలాయిస్తున్న ఆ పార్టీ లో పని చేస్తున్న ఎస్సీ,ఎస్టీలకు కు

మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్

ఎలాంటి అధికారాలు వుండవని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని తొలగించిన వ్యక్తులే అదే చోటులో విగ్రహాన్ని ఆవిష్కరించాలని, లేకుంటే మాల మహానాడు ఆధ్వర్యంలో మండలంలోని పోలీస్ స్టేషన్, తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పుంగనూరు మండలంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్న సమస్యలను చెప్పుకోవడానికి ప్రతి నెలా మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించే ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించడం లేదని వాటిని కూడా ప్రతినెలా తప్పకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురు కుప్పం మండలంలో జిటి కండ్రిగ పిఆర్‌సి కల్యాణ మండపం ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆ కళ్యాణ మండపం వ్యవ స్థాపకులు రాధిక పురంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు హరికృష్ణ, ఆ పార్టీ నాయకులు హాజరయ్యారు. వారికి పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ బద్ధంగా అర్చకులు క్రతువు నిర్వహించారు. శ్రీరామనవమి కావడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు హాజరయ్యారు.



మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామితో కల్యాణ మండపం వ్యవస్థాపకులు రాధికాపురందర్ రెడ్డి

పశువుల పోటీలు సంప్రదాయానికి నిదర్శనం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల: పశువుల పోటీలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. ఐరాల మండలం దివిటివారిపల్లెలో ఆదివారం నిర్వహించిన పశువుల పండగలో ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ హాజరయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకూ ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొదట గ్రామస్తులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలోని స్థానిక ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం దివిటివారిపల్లె గ్రామంలో నిర్వహించి ఎద్దుల పోటీలను ఆయన ప్రజలతో కలిసి వీక్షించారు. వివిధ గ్రామాల మధ్య నుండి వచ్చిన రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి పోటీలో పాల్గొన్నారు. ఎద్దుల పరుగు పోటీలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ఎద్దుల పోటీలు మన భారతీయ సంస్కృతిలో ఒక ప్రాచీన సంప్రదాయానికి నిదర్శనమన్నారు. ఇవి వినోదం కోసం మాత్రమేనని, ఈ పోటీలు జరుగుతున్న సమయంలో భద్రతా చర్యలను పాటించడం అత్యంత అవసరం అని

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

పేర్కొన్నారు. ఎద్దులు పరుగులు పెడుతున్న సమయంలో వీక్షకులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల టిడిపి అధ్యక్షులు గిరిధర్ బాబు, చిత్తూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, దివిటివారిపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలో శ్రీ అన్నపూర్ణాంబ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, రక్షాబంధనం, ధ్వజా రోహణం, అంకురార్పణ కలశ స్థాపన హోమాలు నిర్వహించారు.

టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కీర్తనలు ఆలపించారు. జ్యోతి నగర వైశ్య సంఘం వారు అన్నపూర్ణాంబ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ఆలయానికి వితరణ చేశారు. రాత్రి నంది వాహనోత్సవం ఆలయ మాడ వీధుల్లో విహరింపజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా రైతు సంఘం వారు వ్యవహరించారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బజారువీధిలోని శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలను తెలిపారు. అందరూ సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యంతో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, కృష్ణమూర్తి, మదన్, శ్రీధర్, కిరణ్, బిఆర్‌సి కుమార్, లోకేష్ ఆచారి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలం మొగిలి వెంకటగిరి, పాలేరు గ్రామాల్లో ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించారు. మొగిలి వెంకటగిరిలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టి సీత సమేత రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పాలేరు సీతారామ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం గ్రామానికి చెందిన పూర్ణ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సమితి అధ్యక్షులు తులసి రామకృష్ణారెడ్డి సర్పంచ్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, దీప్తి గ్రామస్తులు ప్రకాష్ రెడ్డప్ప, సదాశివరెడ్డి, రుక్కు మంద , పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం పెరుమాళ్ళ పల్లి కోదండ రామస్వామి ఆలయంలో ఉభయ దాతలు బోడి రెడ్డి లేట్ వెంకట్ రెడ్డి కుమారుడు లక్ష్మీనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ఆయా గ్రామాల పరిధిలో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త కార్యనిర్వహణ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు రూరల్ మండలం మేజర్ పంచాయతీ కొలమాసన పల్లిలో వెలసిన వైకుంఠ రామాలయంలో

పలమనేరులో

పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. అర్చకులు రంగనాథ స్వామి బృందం ఆధ్వర్యంలో కల్యాణోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ గుప్తా, అరుణ దంపతులు, శ్రీనాథ్ ,వాసంతి దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నదానం చేశారు.

కార్వేటినగరంలో

కార్వేటినగరం: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో వెలసి ఉన్న శ్రీసీతరాముల ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, పంచాగశ్రవణం నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం మూల విరాట ఏకాంత తిరుమంజనం నిర్వహించి శ్రీసీతా రాముల వారితో పాటు లక్ష్మణుడి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి హనుమంత వాహనంపై ప్రతిష్టించి చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామ వీధోత్సవంలో అనంతరం మధ్యాహ్నం 11.30 నుంచి12.30 గంటల వరకు స్వామివారికి శ్రీరామ నవమి ఆస్థానం నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కళ్యాణాన్ని వేద పండితులు వేద మంత్రాల నడుమ సీతమ్మ శిరస్సుపై ముత్యాల తలంబ్రాలు పోసి నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారులు సురేష్కుమార్, వేద పండితులు రమేష్, శబరి, గోపాలాచారి వేదపారాయణుడు శివశర్మ, షరాబ్ బాబుసురేష్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : శ్రీరామ నవమిని పురస్కరించుకొని ఐడిపిఎస్ లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలోని శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐడిపిఎస్ ఛైర్మన్ బిఎం దయానిధి మాట్లాడుతూ అందరికీ ఆదర్శనీయుడు శ్రీరాముడు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులు శ్రీరాముని వేషంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఐడిపిఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుల్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని వాడవాడల శ్రీరామనవమి పండుగను వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయాల్లో విశేష పూజలు చేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సీతా రాముని హరికథ కాలక్షేపాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటాలు, పండరి భజన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం, పానకం, పెసరపప్పు పంచిపెట్టారు.

సోమల: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మండలంలోని అన్ని రామాలయాలలో ఘనంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించే భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. పత్రపల్లి కోదండ రామస్వామి ఆలయంలో, సోమల యోగాభి రామస్వామి వారి ఆలయంలో, ఇరికిపెంట, కందూరు గ్రామాలలో ఉదయం నుండి భక్తులు శ్రీరామ దర్శనం కోసం బారులు తీరి దర్శనానంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రొంపిచర్ల : రొంపిచర్ల శ్రీ కోదండ రామాలయంలో అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అర్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సీతారామ కళ్యాణం నిర్వహించారు.

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
I.A.No: 507/2024
O.S.No: 645/2015
Between
Syed Alla Basha Saheb & 6 others ...Petitioners/D1 to D7.
And
P.Munirathnam ...Respondent/Plaintiff.
NOTICE TO THE RESPONDENT/PLAINTIFF
To
P.Muni Rathnam S/o Chinna Pullai, Hindu, aged about 73 years, resident of D.No; 2-3, Puthalapattu village, post & mandal, Chittoor district
Sir,
Please take notice that the above Petition was filed against you for passing of final decree for division of the plaint schedule property in terms of preliminary decree and the said matter is posted to **11-04-2025** for your appearance. Please be present on **11-04-2025 at 10.30 A.M**, before the said court either in person or through your advocate. Otherwise, the matter will be decided exparte.
Sd/- **V.LOKANADHA NAIDU,**
Advocate for Petitioners/D1 to D7
Place:Chittoor, Date:06.04.2025

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
I.A.No: 508/2024
O.S.No: 645/2015
Between
Syed Alla Basha Saheb & 6 others ...Petitioners/D1 to D7.
And
P.Munirathnam ...Respondent/Plaintiff.
NOTICE TO THE RESPONDENT/PLAINTIFF
To
P.Muni Rathnam S/o Chinna Pullai, Hindu, aged about 73 years, resident of D.No; 2-3, Puthalapattu village, post & mandal, Chittoor district
Sir,
Please take notice that the above Petition was filed against you for appointment of advocate commissioner for division of the plaint schedule property in terms of preliminary decree in order to pass the final decree and the said matter is posted to **11-04-2025**for your appearance. Please be present on **11-04-2025 at 10.30 A.M** , before the said court either in person or through your advocate. Otherwise, the matter will be decided exparte
Sd/- **V.LOKANADHA NAIDU,**
Advocate for Petitioners/D1 to D7
Place:Chittoor, Date:06.04.2025